సమాచార కేంద్రం ప్రారంభం ఎప్పుడు?


ధ్వంసమైన ఫ్లోరింగ్

- తొట్లకొండ ప్రాశస్త్యం తెలిసేలా కేంద్రం ఏర్పాటు
- ఏళ్లు గడిచినా ప్రారంభానికి నోచుకోని వైనం
- సందర్శకుల్లో నిరాశ


ప్రారంభానికి నోచుకోని తొట్లకొండ సమాచార కేంద్రం

కొమ్మాది: చారిత్రక ప్రాశస్త్యం గల పర్యాటక ప్రాంతం తొట్లకొండ. నాటి బౌద్ధ భిక్షువులు నడయాడిన పవిత్ర ప్రదేశం. దీని విశిష్టతను భావితరాలకు తెలియజేయాలనే సంకల్పం, పర్యాటకులకు మరిన్ని సౌకర్యాల కల్పన కోసం ఏర్పాటు చేసిన సమాచార కేంద్రం ఏళ్ల గడిచినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో సందర్శకుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

చెక్కుచెదరని ఆనవాళ్లు..
సాగరానికి అభిముఖంగా ఉన్న ఈ కొండపై ధ్యాన మందిరాలు, రాతి స్తంభాలు, నాటి వంటశాలలు, భోజన శాలలు, చైత్యగృహాలు, నీటి తొట్టెలు, మహాస్తూపం, ప్రధాన బౌద్ధ భిక్షువు గది, సమావేశ మందిరం .. ఇలా ఎన్నెన్నో చారిత్రక సాక్ష్యాలుగా దర్శనమిస్తున్నాయి. ఈ కట్టడాలన్నీ కాల్చిన ఇటుకలతో నిర్మించినవే. అయినా నేటికీ చెక్కు చెదరలేదు. ఇక కొండపై నుంచి సీ వ్యూ అద్భుతంగా ఉంటుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పర్యాటకులను మరింతగా ఆకర్షించేలా, ఇక్కడి చరిత్రను భావితరాలకు తెలిపేలా ఆధునిక హంగులతో సమాచార కేంద్రాన్ని నిర్మించారు.

తొట్లకొండ చరిత్రను తెలిపేలా..
ఈ సమాచార కేంద్రంలో ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, గ్యాలరీ, పబ్లికేషన్ సెంటర్, సమావేశ మందిరం ఉన్నాయి. తొట్లకొండకు సంబంధించిన చరిత్రను తెలిపేవిధంగా వీటిని ఏర్పాటు చేశారు. వచ్చిన సందర్శకులకు ఇబ్బంది లేకుండా క్యాంటీన్, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించారు. అయితే ఏళ్లు గడిచినా ఈ సమావేశ మందిరం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం ఈ సమాచార కేంద్రం చుట్టూ పెద్ద ఎత్తున తుప్పలు పెరిగిపోయాయి. కేంద్రంలో ఫ్లోరింగ్ చాలాచోట్ల ధ్వంసమైంది. దీనికి చేరుకునే దారి దయనీయంగా ఉంది. అయితే ఇదిలా ఉండగా పర్యాటకం, పురావస్తుశాఖ సమన్వయ లోపం వలనే ప్రారంభానికి నోచుకోవడం లేదనే విషయం తెలుస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యాటకులకు ఈ సమాచార కేంద్రాన్ని అందుబాటులో తీసుకురావాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

నిరాశతో వెనుకకు..
ఎంతో ప్రఖ్యాతి గాంచిన తొట్లకొండను చూసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా దేశవిదేశాలకు చెందిన పర్యాటకులతో పాటు ప్రపంచ దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులు ఇక్కడికి చేరుకుంటారు. అయితే, ఇక్కడ కనీస సౌకర్యాలు లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. కుటుంబంతో గడిపేందుకు సరైన స్థలం గానీ, తాగేందుకు నీరు గానీ లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమాచార కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకువస్తే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుంది.

అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం
తొట్లకొండపై నిర్మించిన సమాచార కేంద్రం ప్రారంభం కోసం అనేక సార్లు ఉన్నతాధికారుల దృష్టికి, పురావస్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లాం. త్వరలో ప్రారంభించి పర్యాటకులకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నాం.
– ఆర్.ఫాల్గుణరావు, పురావస్తు శాఖ ఏడీ


సమాచార కేంద్రానికి వెళ్లే దారి ఇలా..


తొట్లకొండ

• అమ్మరూపం.. అపురూపం





అమ్మవార్లు మంగళవారం ప్రత్యేక అలంకరణల్లో దర్శనమిచ్చారు. జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట, కొత్తపేట తదితర గ్రామాల ఆరాధ్య దేవత కొత్తమ్మ తల్లిని మల్లె, కనకాంబరం, గులాబీ, చామంతి, తులసిమాలలతో అలంకరించారు. నీలాపు అభినవ్ రెడ్డి ఈ అలంకరణకు సహకారం అందించారు. మజ్జివలస గ్రామదేవత రాస పోలమాంబ అమ్మవారి 108వ అలంకరణలో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు రూ.10 నాణేలు, రూ.10, రూ.20 నోట్లు జర్బరా పువ్వులతో అలంకరించారు. ఈ అలంకరణకు తుపాకుల రామరాజు, ఉష దంపతులు సహకారం అందించారు.
– తగరపువలస

మధ్యాహ్న భోజన సిబ్బందికి శిక్షణ నేడు

భీమునిపట్నం: భీమిలి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వహణ సిబ్బందికి బుధవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంఈవో శివరాణి మంగళవారం తెలిపారు. బ్యాంక్ కాలనీ సమీపంలోని ప్రకృతి స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు ఏ విధమైన ఆహారాన్ని అందించాలి, ఇందుకోసం పాటించవలసిన విధానం, జాగ్రత్తల గురించి శిక్షణ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వారికి వంటల పోటీలను నిర్వహిస్తామన్నారు.

డ్రైనేజీలోకి దూసుకుపోయిన ద్విచక్రవాహనం


కాలువలో పడిపోయిన ద్విచక్రవాహనం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు తిమ్మాపురంలో ఓ ద్విచక్రవాహనం కాలువలోకి దూసుకుపోయింది. ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపు తప్పి 8 అడుగుల లోతున్న డ్రైనేజీలో పడిపోయాడు. అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ కాలువ నిర్మాణం ప్రమాదకరంగా ఉండటంతో కాలువపై పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు గతంలోనే అధికారులను కోరారు. అయినా చర్యలు తీసుకోకపోవడంతో తరచూ ఇలా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

తైక్వాండోలో మధురవాడ క్రీడాకారుల ప్రతిభ


విజేతలతో కోచ్‌లు, అతిథులు

మధురవాడ: జిల్లా స్థాయి తైక్వాండో పోటీలలో మధురవాడకు చెందిన క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరచి 33మంది పతకాలు కైవసం చేసుకున్నారు. ఇటీవల నడుపూరులో జరిగిన ఈ పోటీల్లో మధురవాడ యూత్ తైక్వాండో క్లబ్ క్రీడాకారులు వివిధ కేటగిరీల్లో 19 స్వర్ణ, 9 రజత, 5కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను కోచ్ మాకన సురేష్ సుకుమార్, సంపత్‌లను శ్రీ కనకదుర్గా క్యాటరింగ్ అండ్ సప్లయర్స్ ప్రొప్రయిటర్ కొర్రాయి సురేష్, ఇతర పెద్దలు అభినందించారు. న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు పి.అచ్యుతరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అచ్చింనాయుడు తదితరులు కోచ్‌లు, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణ పూజలు నేడు

తగరపువలస: జీవీఎంసీ రెండోవార్డు సంతపేట గొల్లవీధిలో బుధవారం నుంచి శ్రీవేణుగోపాల స్వామి ఆలయ నిర్మాణ పూజలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు హోమం, రాత్రి 2.30 నుంచి 3 గంటల (తెల్లవారితే గురువారం) లోగా ఆలయ శంకుస్థాపన పూజలు నిర్వహించనున్నట్టు ఎస్‌బీటీ గోపాలకృష్ణ, యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు. భక్తులంతా ఈ పూజా కార్యక్రమాలలో పాల్గొనాలని కోరారు.

యునిసెఫ్ లీడర్‌షిప్ సమ్మిట్‌కు ఓక్రిడ్జ్ విద్యార్థులు

తగరపువలస: అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో 'ది విలేజ్ స్కూల్' వద్ద ఈ నెలలో నిర్వహించనున్న నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ - యునిసెఫ్ లీడర్ సమ్మిట్‌కు భీమిలి మండలం శింగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఆనందిత, ఐశ్వర్య, విభా, వృషాలి ఎంపికయ్యారు. ఈ బృందానికి ఓక్రిడ్జ్ వైజాగ్ సోషల్ ఇంపాక్ట్ లీడ్ మాధురి గుప్తా మార్గదర్శకత్వం వహించనున్నారు. వారం రోజుల పాటు జరగనున్న సమ్మిట్‌కు ప్రపంచవ్యాప్తంగా విద్యార్థుల నాయకుల్ని ఒకచోట చేర్చనున్నారు. వారు నాయకత్వ లక్షణాలపై శిక్షణకు పొందే వర్క్‌షాపులు, చర్చలు, గ్రూప్ ప్రాజెక్టులలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ గత మూడేళ్లుగా తమ విద్యార్థులు ఈ సమ్మిట్‌లో పాల్గొంటూ సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలపై సానుకూల ప్రభావం చూపించే ప్రయత్నాలు చేశారన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల మొండిచేయి

తగరపువలస: వృద్ధులు, దివ్యాంగులకు ఇంటికే రేషన్ పంపిణీ చేయనున్నట్టు కూటమి ప్రభుత్వం చెప్పిన మాటలు భీమిలిలో అమలు కావడంలేదు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు రేషన్ డిపోల చుట్టూ తిరిగినా, ఎవరినైనా తోడు తెచ్చుకోండి అంటూ వెటకారం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. డీలర్ల పనులకు పొంతన లేకుండా పోతోందని వృద్ధులు, దివ్యాంగులు వాపోతున్నారు.

ఎక్కడి నీరు అక్కడే..


సొరిస్ ఆశ్రమానికి వెళ్లే మార్గంలో నిలిచి ఉన్న నీరు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని నేరెళ్లవలస కాలనీ వద్ద రోడ్డులో వర్షం పడితే నీరు నిలిచిపోతూ చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడ కాలనీ ప్రధాన మార్గంలో కొద్ది దూరం వెళ్లిన తరువాత ఎడమవైపునకు సొరిస్ ఆశ్రమానికి వెళ్లే మార్గం ఉంది. అక్కడ రోడ్డు మొదట్లో ఈ సమస్య ఉంది. చిన్న వర్షం పడితేనే నీరు నిలిచిపోతోంది.. ఇక పెద్ద వర్షాలు పడితే అంతే సంగతి. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. నడిచి వెళ్లేవారు తప్పనిసరిగా బురద నీటిలో దిగి నడవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. చాలాకాలంగా సమస్య ఉందని, దీనిపై అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుందని, అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డు ఆక్రమణపై నిరసన


రోడ్డును ఆక్రమించేస్తున్నారంటూ నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ బీచ్‌రోడ్డును ఆనుకుని ఉన్న భగవతులు లేఅవుట్‌లో ఏళ్ల తరబడి నివసిస్తున్నామని, అయితే ఇప్పుడు ఈ లేఅవుట్‌కు ఉన్న 30 అడుగుల రోడ్డును ఓ వ్యక్తి ఆక్రమించి నిర్మాణం సాగిస్తున్నారని లేఅవుట్ యజమానులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ లేఅవుట్‌లో ఉన్న గృహ సముదాయాలకు, ఖాళీ స్థలాలకు ఇదే ప్రధాన రహదారి అని, అలాంటి రోడ్డును మూసివేసి ఆక్రమించేస్తున్నారని లేఅవుట్ యజమానులు సాయిరాజ్, రామకృష్ణ రాజు, కిషోర్ కుమార్ తదితరులు తెలిపారు. అనంతరం పోలీసులకు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఇక్కడికి చేరుకున్న పోలీసులు 'నిర్మాణ పనులను వెంటనే ఆపివేయాలని, ఇరువర్గాల వారు తమ స్థలానికి సంబంధించిన పత్రాలతో పోలీస్‌స్టేషన్‌కు రావాలని' సూచించారు. దీంతో నిర్మాణ పనులను తాత్కాలికంగా నిలిపివేశారు.

అర్ధరాత్రి విద్యుత్ అంతరాయం

నిద్ర లేక జనం జాగారం


చీకటిలో స్వతంత్రనగర్

మధురవాడ: సోమవారం రాత్రి సుమారు 10గంటల నుంచి రాత్రి 1గంట వరకు కొమ్మాది జంక్షన్, టీచర్స్ లే అవుట్ రేవళ్లపాలెం, పీఎం పాలెం పోలీసు స్టేషన్ ఏరియా, కొమ్మాది తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో జనం ఇబ్బంది పడ్డారు. అర్ధరాత్రి వరకు జాగారం చేశారు. స్వతంత్రనగర్, శివశక్తినగర్ రోడ్డు, మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిసర ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. సబ్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేద్దామంటే ఫోన్ ఎత్తి సమాధానం చెప్పేవారే కరువయ్యారని వినియోగదారులు వాపోతున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, సమస్య ఏమిటో తెలియక పిల్లలు, వృద్ధులతో ఇబ్బంది పడ్డారు.

'చంద్రబాబుది వికృత రాజకీయ క్రీడ'

తగరపువలస: వికృత రాజకీయ క్రీడలో చంద్రబాబు సిద్ధహస్తుడని రాష్ట్ర వలంటీర్ల సంఘం అధ్యక్షుడు నాగార్జున యాదవ్ అన్నారు. భీమిలి మండలం టి.నగరపాలెంలో మంగళవారం జరిగిన కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరత్వానికి బ్రాండ్ అంబాసిడర్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అయితే వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీ నుంచి 2024 ఎన్నికలలో ఓట్లేసిన రాష్ట్ర ప్రజల వరకు అందరికీ వెన్నుపోట్లు పొడిచారన్నారు. గత పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీ చూడకుండా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. అయిదేళ్ల పాటు ప్రజలు రోడ్డుపైకి రాకుండా ఇంటింటా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీదే అన్నారు. బుధవారం రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో వైఎస్సార్‌సీపీ నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమంలో ప్రజలు కదంతొక్కి దిక్కులు పిక్కటిల్లేలా నిరసన తెలియచేయాలన్నారు. కార్యకర్తలు, నాయకులను వేధిస్తున్న కూటమి నాయకులకు జగన్ 2.0 పాలనలో వడ్డీతో సహా బుద్ధి చెబుదామన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు జరిగిన ప్రతి ఒక్క శాతం నష్టాన్ని 10 శాతం ప్రయోజనంతో భర్తీ చేద్దామన్నారు. కూటమి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేయడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో పులివెందుల తరువాత చిన్న శ్రీను నాయకత్వంలో భీమిలిలో వైఎస్సార్‌సీపీకి అతి ఎక్కువ మెజారిటీతో విజయకేతనం ఎగరవేయడం ఖాయమన్నారు.

వైభవంగా బంగారమ్మ రథోత్సవం




పద్మనాభంలో తిరుగుతున్న బంగారమ్మ రథం, దుర్గాలమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

పద్మనాభం: బంగారమ్మ వారి రథోత్సవం పద్మనాభంలో మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. వ్యవసాయ బండిని ఏనుగు రూపంలో రథంగా తీర్చిదిద్దారు. సతకంపట్టు వద్ద రథానికి ముందుగా గ్రామస్తులు పూజలు చేశారు. తదుపరి తాలాడ, బుగత, అవనాపు వారి కుటుంబాల సభ్యులు పది మంది రథంపై ఆశీనులయ్యారు. అనంతరం సతకంపట్టు నుంచి రథోత్సవం ప్రారంభమైంది. అమ్మవారి నామస్మరణ నడుమ రథం గ్రామంలో మూడుసార్లు తిరిగింది. అడుగడుగునా మహిళలు రథం పైకి చీరలు, అరటిపళ్లు విసిరి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాల్లో భాగంగా కృష్ణాపురంలోని దుర్గాలమ్మ, పద్మనాభం గ్రామం, జంక్షన్‌లో ఉన్న బంగారమ్మ ఆలయాలను, పైడి తల్లమ్మ ప్రతిరూపమైన ముసిడి చెట్టును భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు.

అమ్మవారి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు
బంగారమ్మ వారిని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప దర్శించుకుని, పూజలు చేశారు. పార్టీ నాయకులు సత్యనారాయణ, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


బంగారమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీపీ రాంబాబు, సిరి సహస్ర

కూటమి పాలన అంతా దోచుకోవడమే..

- వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను
- భీమిలి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం


హాజరైన భీమిలి మండల కార్యకర్తలు, నాయకులు


వెన్నుపోటు దినం పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను, నాయకులు

తగరపువలస: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అంతా దోచుకోవడం, దాచుకోవడమే తప్ప రాష్ట్ర ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. టి.నగరపాలెం వద్ద ఎంఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన భీమిలి మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంటింటా రేషన్ సరఫరాకు వాహనాలు సమకూరిస్తే ప్రజా సంక్షేమం నచ్చని చంద్రబాబు వాటిని రద్దు చేసి రేషన్ బియ్యం కోసం అడవులు, నదులు దాటిస్తూ వృద్ధులని కూడా చూడకుండా రోడ్డున పడేశారన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, సోషల్ మీడియాను వేధింపులకు గురిచేసి అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. అమ్మఒడి పథకాన్ని తల్లికి వందనం పేరుతో మార్చి ఏడాది కాలంగా ఊరిస్తూ ఒక్క పైసా కూడా విదల్చలేదన్నారు. కొత్తగా ఒక్క పెన్షన్ ఇవ్వక పోయినా ఏడాది పాలనలో రూ.1.60 లక్షల కోట్లు అప్పులు మాత్రం చూపించారన్నారు. కూటమి ప్రభుత్వం పుణ్యమా అని జిల్లాలో 10 వేల పెన్షన్లు తగ్గాయన్నారు. మన ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి 6 మాసాలకు సచివాలయాల ద్వారా అర్హులకు కొత్త పెన్షన్లు అందించిన విషయం గుర్తు చేశారు. సూపర్ సిక్స్ పథకాలు, ప్రజలకు రుణాలను గాలిలో వదిలేసి మట్టి, గ్రావెల్ తవ్వకాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణతో కూటమి నాయకులు బిజీగా ఉన్నారన్నారు. వైఎస్ జగన్ పాలసీ..' అధికారంలో ఉంటే ప్రజలతో, ప్రతిపక్షంలో ఉంటే ప్రజల కోసం పనిచేయడమే' అన్నారు.

ప్రతి కార్యకర్తకు గౌరవం పెంచుదాం..
2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. పార్టీని నాయకులు వదిలేసినా భీమిలిలో కార్యకర్తల బలం చెక్కుచెదరలేదన్నారు. కూటమి ప్రభుత్వ తాటాకు చప్పుళ్లకు అదరలేదు, బెదరలేదన్నారు. నియోజకవర్గంలో దిగువ స్థాయి కార్యకర్త వరకు ఏ సమస్య వచ్చినా ఈ చిన్న శ్రీను ఉన్నాడన్న విషయం మరచిపోవద్దన్నారు. గ్రామాల వారీగా పార్టీని, బూత్ కమిటీలను బలోపేతం చేసుకుని ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమి ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదామన్నారు. ఓటరుకు మార్గదర్శి అయిన కార్యకర్తలకు జగన్ 2.0 పాలనలో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈలోగా పార్టీలో కొత్తగా కమిటీలను నియామకం చేసుకుందామన్నారు. ప్రతి కార్యకర్తకు గౌరవం పెంచడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ
భీమిలిలో బుధవారం చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వానికి తమ నిరసన తెలియచేయాలని చిన్నశ్రీను కోరారు. వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం చిన్న శ్రీనును మండల నాయకులు గజమాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ భీమిలి మండల అధ్యక్షుడు గాడు శ్రీను ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో దాట్ల వెంకట అప్పల ప్రసాదరాజు, ఎలమంచిలి సూర్యనారాయణ, కేవీ సూర్యనారాయణరాజు(పులిరాజు), ఎంపీపీ దంతులూరి వాసురాజు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సరగడ రఘునాథరెడ్డి, మద్దిల వెంకటరమణ, కార్పొరేటర్ దొలపల్లి ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఉండబట్ల ఆదిలక్ష్మి, చెల్లూరు నగేష్, మజ్జి సూరినాయుడు, లచ్చుబుగత జగదీశ్వరరావు, కొయ్య రామకృష్ణారెడ్డి, సమ్మిడి శ్రీనివాసరావు, పొట్నూరు చంద్రశేఖర్, పల్లా సన్యాసిరావు, కొయ్య శ్రీనివాసరెడ్డి, బోని సన్నిబాబు, దుంపల ప్రభాకర్, చిల్ల హరి, సురపతి అప్పలరాజు, చిల్ల కృష్ణారెడ్డి, మేరుగు ఎల్లాజీ, బొద్దు దుర్గారావు, దూడ ధనంకొండ, కేపీ సత్యనారాయణ, తుపాకుల అప్పలస్వామి, అక్కరమాని అప్పలనాయుడు, సరగడ రాంబాబు, గొలగాని సన్యాసిరావు, వెంపాడ సూరిబాబు, తోట ఎల్లారావు తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో..
సింహాచలం: భీమిలిలో బుధవారం నిర్వహించే వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు పిలుపునిచ్చారు. భీమిలి నియోజకవర్గ పరిధి అడవివరంలోని ఓ కల్యాణమండపంలో వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ హామీల జాడే కానరావట్లేదన్నారు. సమావేశంలో వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, యువజన విభాగం అధ్యక్షుడు బోర మోహన్‌రెడ్డి, నాయకులు లంక సత్తిబాబు, దమ్ము ఎర్రాజీరావు, బోర కృష్ణారెడ్డి, సిరిపురపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు దినం'తో కూటమి ప్రభుత్వం కళ్లు తెరవాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి

తగరపువలస: రాష్ట్ర ప్రజలను వంచనకు గురి చేసి, ఓట్లు వేయించుకుని ఏడాది కాలం గడిపిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ బుధవారం చేపట్టనున్న 'వెన్నుపోటు దినం'తో అయినా కళ్లు తెరవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్ రెడ్డి అన్నారు. భీమిలిలో మంగళవారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచి ఏడాది పూర్తయిందన్నారు. మోసపూరిత వాగ్దానాలు ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన తొలి ఏడాది రూ.1.49 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని ఎక్కడ అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ప్రజలకు ఇస్తామన్న పథకాలు వెంటనే అందించకపోతే ప్రజలు విసిగి వేసారి, బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

రైతులకు సాగుపై అవగాహన


ఆనందపురంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

తగరపువలస: వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆనందపురం మండలం వెల్లంకి, బోని, ఆనందపురం పంచాయతీలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. భారతీయ వ్యవసాయ మంత్రిత్వశాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో తొలకరిలో యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల విశిష్టత, పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత గురించి తెలిపారు. నూతన వరి రకాలను పరిచయం చేశారు. ఉద్యానవన శాఖ పథకాలను వివరించారు. కార్యక్రమాల్లో జిల్లా వ్యవసాయాధికారి కొత్తూరు అప్పలస్వామి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి సత్యనారాయణరెడ్డి, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.మోహనరావు, వ్యవసాయ సంచాలకులు పద్మశ్రీ, విజయప్రసాద్, హరికృష్ణ, కేవీకే శాస్త్రవేత్తలు ఎన్.రాజీకుమార్, సౌజన్య, ఎన్.కిషోర్‌కుమార్, ఎన్‌ఐఆర్‌సీఏ నుంచి టి.కిరణ్‌కుమార్, సీఎంఎఫ్ఆర్ఐ నుంచి ఇందిర, సీటీఆర్ఐ నుంచి వెంకటేశం, అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రతినిధులు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.